క్లుప్తంగా

వైభవంగా గోదాదేవి, రంగనాధుని కల్యాణం



గోదాదేవి రంగనాధుని కల్యాణ వేడుక నిర్వహిస్తున్న దృశ్యం

పెదకూరపాడు: స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయంలో గోదాదేవి రంగనాధుని కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చక స్వాములు వేదాంత కృష్ణకిషోర్ శ్రీనివాసాచార్యులు పుణ్యదంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి

అమరావతి: సంక్రాంతి సందర్భంగా దిడుగు గ్రామంలో మహిళలకు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దిడుగు గ్రామ సర్పంచ్ వింతా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్పూర మకర జ్యోతి దర్శనం



గీతా మందిరం వద్ద కర్పూర మకరజ్యోతి వెలిగించిన దృశ్యం

అమరావతి: అమరావతిలోని గీతామందిరం వద్ద శనివారం రాత్రి మకర సంక్రాంతి సందర్భంగా హరిహర సుతుడు అయ్యప్పస్వామి కర్పూర మకర జ్యోతిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. తొలుత అయ్యప్పస్వామి చిత్రపటాలను ఊరేగించి, అనంతరం రంగురంగుల పువ్వులతో అలంకరించిన ప్రత్యేక వేదికపై కర్పూర దీపాన్ని వెలిగించారు. ఈ కర్పూర మకరజ్యోతిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల శరణుఘోషతో మందిరం ప్రతిధ్వనించింది. 25 కిలోల కర్పూర మకర జ్యోతిని వెలిగించినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి మహిళా మండలి, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అ'పూర్వ' కలయిక



నార్నెపాడు ఎంపీపీ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

నార్నెపాడు(ముప్పాళ్ళ): ఏరా సుధాకర్ ఏం చేస్తున్నావు...పిల్లలు ఎలా ఉన్నారు...అరే హరిబాబు వయసుతో పాటుగా పొట్ట కూడా బాగా పెరిగిందిరా అంటూ సరదా గా నవ్వుకుంటూ, కుటుంబ యోగ క్షేమాలు తెలుసుకుంటూ...ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ...చిన్ననాటి పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సరదాగా సాగింది. ఈ సరదా కలయికకు 33 సంవత్సరాల క్రితం వారంతా చదువుకున్న ఎంపీపీ పాఠశాల వేదికైంది. మండలంలోని నార్నెపాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో 1989–90 పదవతరగతి విద్యార్థుల అపూర్వ కలయిక శనివారం జరిగింది. మొత్తం 24 మందికి గాను 22 మంది హాజరై చదువుకునే రోజుల్లో తరగతి గదిలో చేసిన అల్లరి పనులను నెమరువేసుకుంటూ సరదాగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయుల దండనలను గుర్తు చేసుకుంటూ, కుటుంబ సభ్యులను ఒకరి కొకరికి పరిచయం చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అప్పటి తెలుగు ఉపాధ్యాయుడు మోటుమర్రినాగేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయుడు కుందాభాస్కరరావు లను ఘనంగా సన్మానించారు. అందరూ కలిసి గ్రూప్ ఫోటోలతో సరదగా సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు గా సాయం అందించేలా నిర్ణయం చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు మోపర్తినరసింహారావు, లావుహరిబాబు, గరికపాటిజానకిరామయ్య, పాతూరిసుధాకర్, మస్తాన్‌వలి, గౌస్‌బా, ఆలీ పాల్గొన్నారు.

ఘనంగా భోగి పర్వదిన వేడుకలు

సత్తెనపల్లి: భోగి పర్వదిన వేడుకలు శనివారం సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలు పిడకలు, తమ ఇళ్లల్లోని పనికిరాని వస్తువులను భోగి మంటల్లో వేసి కాల్చారు. ఈ సందర్భంగా చిన్నారులపై భోగి పళ్ళు పోశారు. పట్టణంలోని 22వ వార్డులో ఫిరంగిపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పీపీజీ ప్రసూన ఆదేశాల మేరకు ఏడబ్ల్యుసీ నందు చిన్నారులకు భోగి పళ్ళు పోశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ జి.జయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పి.మాణిక్యం, ఈ.అంజనీదేవి, డి.శాంత కుమారి, అంగన్వాడీ సహాయకులు వై. కోటేశ్వరమ్మ, జి.అంజనాదేవి పాల్గొన్నారు. పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో రుక్మిణీ సత్యభామ సమేత వేణు గోపాల స్వామి దేవాలయం వద్ద ఈఓ వెంకటేశ్వరరెడ్డి భోగి మంటలు ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్ సెంటర్‌లో వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి పర్వదిన వేడుకలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరై భోగిమంటలను ప్రారంభించారు. బంజారాలతో కలిసి నృత్యం చేశారు. పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం భోగి మంటలు వేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కట్టా శంకరరావు మాట్లాడుతూ సనాతన ధర్మం భారత దేశంలో ఒక్క భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమన్నారు. సంప్రదాయ బద్ధంగా ఆవు పిడకలు తదితర వస్తువులతో భోగి మంటలు వేసి భారత్ మాతాకీ జై, మాతరం మాతరం వందేమాతరం జైశ్రీరామ్ అంటూ నినాదాలతో దేశభక్తిని చాటుతూ భగవంతుని స్మరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాస రావు, నాయకులు కొల్లిపర భాస్కర్, పెద్దన్నారావు నాయక్, చలువాది చిన్న సత్య నారాయణ, సౌజన్య భాయ్, చందోలు వెంకట మల్లిఖార్జునరావు, కూరపాటి బసవయ్య, ఆర్ఎస్ఎస్ నాయకులు నేరెళ్ల శంకరావు, కుంచనపల్లి శ్రీనివాసరావు, షేక్ బుడే, తదితరులు పాల్గొన్నారు. అలాగే సత్తెనపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం భోగి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భోగి మంటలు వేసి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గృహాలలో చిన్నారులపై భోగి పళ్ళు పోశారు.

వైభవంగా భోగి పండుగ

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు శనివారం వేకువజాము నుంచి భోగి మంటలు వేసుకుని ఘనంగా పండుగ నిర్వహించారు. అనంతరం స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించారు. పిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

ఘనంగా భోగి వేడుకలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముంగిళ్ళలో పెద్ద పెద్ద ముగ్గులు వేసి అందులో గొబ్బిమ్మలు ఏర్పాటు చేశారు. సాంప్రదాయాలకు ప్రతీకగా తెల్లవారుజామున పెద్దపెద్ద భోగి మంటలు వేసి పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ భోగి మంటల వద్ద కు చేరి ఇంట్లోని పాత వస్తువులను మంటల్లో వేసి కాలుస్తూ వేడుకలు జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని పలు ఆలయాల్లోను స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పట్టణంలోని వేణుగోపాలస్వామి గుడి వద్ద భోగి మంటలు



క్రోసూరు విద్యానగర్‌లో వేసుకున్న భోగి మంటలు



పట్టణంలోని 19వ వార్డు సుందరయ్య కాలనీలో భోగి మంటలు



పట్టణంలోని సుందరయ్య కాలనీలో హరిదాసుడికి మొయనం ఇస్తున్న మహిళ



ముప్పాళ్ళలో భోగి మంటలు వద్ద చిన్నారులు, మహిళలు

చురుగ్గా లిఫ్ట్ ఇరిగేషన్ రోడ్డు పనులు



రహదారిని బాగుచేస్తున్న పొక్లెయిన్

ఊటుకూరు(క్రోసూరు): ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు చెందిన ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ సహకారంతో శనివారం ఊటుకూరు గ్రామం నుంచి గ్రామానికి చెందిన పొలాల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం వరకు రెండు కిలోమీటర్ల రోడ్డు బాగు చేసే పనులు చేపట్టినట్లు ఎంపీపీ పి.కోటయ్య తెలిపారు. ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్‌కు చెందిన పొక్లెయిన్‌తో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిచెట్లు తొలగించి రోడ్డుపై ఉన్న రాళ్లు, రప్పలు శుభ్రం చేయడం జరుగుతుందని తెలిపారు. ఊటుకూరులోని అచ్చంపేట రోడ్డులోగల ఎస్సీ కాలనీ రోడ్డు ఎస్ఎస్ఆర్ పొక్లెయిన్‌తో బాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా ఉచితంగా పొక్లెయిన్ అందించడంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోడి పందేలను అడ్డుకున్న పోలీసులు

- ఆందోళన చేసిన నిర్వాహకులు
- డీఎస్పీ చొరవతో సద్దుమణిగిన వివాదం



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ

పెదకూరపాడు: బుస్సాపురం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కోడిపందేలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నిర్వాహకులు, స్థానికులు ఆందోళన చేయడంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామ పెద్దలతో చర్చించి ఆందోళన విరమింపజేశారు. కోడిపందేలు చట్ట వ్యతిరేకమని, నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా గోదా రంగనాయకుల కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం



పట్టణంలోని వడ్డవల్లి గోదారంగనాయకుల కళ్యాణం



పట్టణంలోని వడ్డవల్లిలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని భోగి పర్వదిన సందర్భంగా పట్టణంలోని వడవల్లి శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గోదా రంగనాయకుల కల్యాణం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోత్సవాల మధ్య కల్యాణం జరిపారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వడవల్లిలోని శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారిని చందనంతో అలంకరణ చేపట్టారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్ లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారిని కృష్ణావతారం అలంకరణ చేశారు. అలాగే పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గాపీఠంలో భోగి పర్వదిన సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తుల పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణం

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణవేడుక శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం పురస్కరించుకుని ఆలయంలోని స్వామివారికి విశేషద్రవ్యములతో అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివార్ల కల్యాణోత్సవం కన్నులపండువగా జరిపించారు. కల్యాణ వేడుకను తిలకించేందుకు గ్రామంలోని మహిళాభక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి కల్యాణవేడుకలను తిలకించి తరించారు. స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆలయనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గోదా కల్యాణం

అమరావతి: అమరావతిలోని పాండురంగస్వామి దేవాలయంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో వేకువజాము నుంచే సుప్రభాతసేవ, పంచామృత స్నపన నిర్వహించి స్వామి వారికి విశేష అలంకారం చేశారు. ఆలయ అర్చకస్వామి పరాశరం రామకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో సంప్రదాయబద్ధంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, నవగ్రహ మండపారాధన అనంతరం గోదాదేవి, పాండురంగస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పట్టణంలో కృష్ణావతారంలో శ్రీవారు



పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో కల్యాణం చేస్తున్న పూజారి



చల్లగుండ్లలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు



గోదా కల్యాణం నిర్వహిస్తున్న స్వాములు

పట్టణంలో పట్టపగలు చోరీ

పిడుగురాళ్ల: పట్టపగలో చోరీ జరిగిన ఘటన పట్టణంలోని జానపాడు డొంక రోడ్డులో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ షేక్ అమీర్ తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన నీలబోలు శ్రీను తన స్వగ్రామమైన పార్వతి పురానికి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగకు వెళ్లారు. రోజు మాదిరిగానే తన ఇంటి పని మనిషి ఇల్లు ఊడ్చేందుకు రావడంతో ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. దీంతో ఇంటి యజమానికి ఫోన్ చేసి సమాచారం అందించడంతో హుటాహుటిన ఇంటికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో ఉన్న సుమారు 40 గ్రాముల బంగారు వస్తువులు దొంగలు అపహరించినట్లు గుర్తించారు. బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం కేసును పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ బంగారు నగల విలువ సుమారు రూ. 1.20 లక్షలు ఉంటుందని తెలిపారు.

9 మంది జూదరులు అరెస్ట్

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడు, తుమృకోట గ్రామాలలో జూదం (పేకాట) ఆడుతున్న 9 మంది అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సయ్యద్ షమీర్‌భాష శనివారం తెలిపారు. మిట్టగుడిపాడు గ్రామ శివార్లోని పొలాలలో పేకాట ఆడుతున్న నలుగురిని, తుమృకోట గ్రామలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద పేకాల ఆడుతున్న మరో 5 గురిని అదుపులోకి తీసుకున్నట్లు వారి వద్ద నుంచి మొత్తం రూ.5,925 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సత్తెనపల్లిలో ఉద్రిక్తత

- అనుమతులకు విరుద్ధంగా రెంటపాళ్లలో జనసేన జెండాఆవిష్కరణకు యత్నం
- పోలీసులతో వాగ్వాదానికి దిగిన జనసేన నాయకులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఉద్రిక్తత వాతావరణ పరిస్థితులు నెలకున్నాయి. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో అనుమతులకు విరుద్ధంగా జనసేన పార్టీ జెండా ఆవిష్కరణకు ఆ పార్టీ నాయకులు శనివారం శ్రీకారం చుట్టారు. శాంతిభద్రతల సమస్యను దృష్టిలో పెట్టుకుని సున్నితమైన రెంటపాళ్లలో అనుమతులకు విరుద్ధంగా జెండా ఆవిష్కరణ విషయం తెలుసుకున్న పోలీసులు అనుమతి లేదని చెప్పారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ససేమిరా అంటూ జనసేన నాయకులు వాదులాడారు. అనుమతులకు విరుద్ధంగా జండా ఆవిష్కరణకు వెళ్లడానికి వీల్లేదని పోలీసులు అడ్డుకోవడంతో ఒక్కసారిగా జనసేన నాయకులు, కార్యకర్తలు పోలీసులను లెక్క చేయకుండా బలవంతంగా నెట్టుకుంటూ పరుగులు తీశారు. ఆ సమయంలో రోడ్లపై ఉన్న ద్విచక్ర వాహనాలు సైతం పడిపోయి పలువురు పోలీసులకు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. అయినప్పటికీ లెక్కచేయకుండా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామం వెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పై జనసేన నాయకులు విమర్శలు చేశారు. రెంటపాళ్ళలో జనసేన జండా ఆవిష్కరణకు ప్రదర్శనగా వెళ్లేందుకు అనుమతి లేకపోయినప్పటికీ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, బొర్రా అప్పారావు, వల్లెం శ్రీనివాసరావు(రాడ్లు శ్రీను), శిరిగిరి మణికంఠతో పాటు మరో 11 మంది, మరికొంత మందిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ యు.శోభన్‌బాబు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం




క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సదనం హరి, ఉల్లంఘుల ప్రసాద్ బాబు

సత్తెనపల్లి: క్రీడల్లో గెలుపు ఓటములను పక్కన పెట్టి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని హరి మిత్రమండలి అధ్యక్షుడు సదనం హరి అన్నారు. పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో హరి మిత్ర మండలి ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం ఆర్‌పీఎల్ సీజన్ 6 నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సదనం హరి మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించేందుకు తర్ఫీదు తీసుకోవాలన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపును లక్ష్యంగా చేసుకొని పోటీ పడతారని, ఓటమిపాలైన క్రీడాకారులు నిరుత్సాహ పడకుండా భవిష్యత్తులో బాగా రాణించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వర రావు నాయక్ మాట్లాడుతూ సంక్రాంతి పేరుతో సంప్రదాయ క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మొత్తం తొమ్మిది జట్లు రాగా నాలుగు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి రూ. 5,116, ద్వితీయ స్థానం సాధించిన వారికి 3,116లు నగదు బహుమతులను అందించడం జరుగుతుందన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ట్రోఫీలను అందజేయడం జరుగుతుందన్నారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను బ్యాటింగ్ చేసి హరి ప్రారంభించారు. రమావత్ కోటేశ్వరరావునాయక్, 30వ వార్డు వైఎస్ఆర్ సీపీ నాయకుడు ఉల్లంఘుల ప్రసాద్‌బాబులను పూలమాలలతో సత్కరించారు. కార్య క్రమంలో హరి మిత్రమండలి సభ్యులు, క్రీడాకారులు, తదితరులు ఉన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి గ్రామోత్సవం

నకరికల్లు: భోగాలనిచ్చే భోగి పర్వదినం పురస్కరించుకుని స్థానిక శ్రీ ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి వార్ల గ్రామోత్సవం శనివారం కన్నులపండువగా సాగింది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా విశేషంగా అలంకరించిన గరుడవాహనంపై ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో స్వామివార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. మహిళాభక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి నామస్మరణ చేస్తూ పురవీధుల్లోని గ్రామోత్సవాన్ని అనుసరించారు. పురవీధుల్లోకి వచ్చిన స్వామివార్లకు మహిళలు వార్లుపోసి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. రాత్రికి స్వామివార్ల కల్యాణవేడుక కన్నులపండువగా సాగింది. విశేష కార్యక్రమాల్లో భాగంగా స్వామి వార్లను దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.



స్వామి వారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీ అమరేశ్వర స్వామివారి దేవస్థానము

అమరావతి - 522020, పల్నాడు (జిల్లా) ఆం. ప్ర.

Ph: 08645-255241, 9666856255 email : eo_sast_amvt@yahoo.com

సీల్డు టెండర్లు ప్రకటన

లేఖ. నెం. ఎ2/60/2022, తేది. 14.01.2023

పల్నాడు జిల్లా, అమరావతి మండలం & గ్రామములో వేంచేసియున్న శ్రీ అమరేశ్వర స్వామి వారి దేవస్థానము నందు 2023 మహాశివరాత్రి సందర్భంగా ఈ క్రింది ఐటమ్స్‌కు సీల్డు టెండర్లు పిలువబడినవి. కాలపరిమితి ది. 18-02-2023 నుండి ది. 21-02-2023 వరకు ఇతర వివరములకు కార్యాలయము నందు సంప్రదించగలరు (గం॥ 9 నుండి సా॥ 6గం॥ వరకు) ఫోన్. 9666856255

1) రంగులు వేయుట నిమిత్తం, 2) క్యూలైన్లు క్లీనింగ్ మరియు తాటీలకు పందిరి ఏర్పాటు, 3) మొత కలీలు (శ్రీ స్వామివారి వాహనములు), 4) శ్రీ స్వామివారి దివ్యరథం రిపేర్లు, 5) గజ తలగాప్సు మరియు పడవలు, 6) పచ్చిపూలు మరియు పూలదండలు అలంకరణ (మహాశివరాత్రి రోజు కల్యాణ మండపమునకు), 7) మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు 7 రోజులు భక్తులకు అన్న ప్రసాదం తయారు చేయు నిమిత్తం 8) మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు 7రోజులు ప్రత్యేక వాయిద్యకారులు (సెల్లారు బ్యాండ్) 9) శానిటేషన్ (మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు 7 రోజులు)

టెండర్ ఫారమ్స్ శ్రీ స్వామివారి దేవస్థానము నందు ది. 16.01.2023 నుండి 23.01.2023 వరకు రూ॥500/-చెల్లించి పొందగలరు. కోట్ చేసి సీల్డు టెండర్లు కవర్లను ది. 23.01.2023 ఉదయం 11 గంటలలోపు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో సీల్డు కవర్లు తెరవబడును.

(శ్రీ స్వామివారి సేవలో) వంశపారంపర్య ధర్మకర్త | (శ్రీ స్వామివారి సేవలో) సం/- కార్యనిర్వహణాధికారి